క్లుప్తంగా

మార్కెట్ చైర్మన్‌కు సన్మానం



వైరా: వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన బొర్ల గంగారావును మంగళవారం 12వ వార్డు రేచర్ల బజార్‌కు చెందిన నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రేచర్ల రామారావు, నాగేశ్వరరావు, విశ్వనాథం, ప్రభాకర్, శ్రీను, సాయి, మేడిశెట్టి కృష్ణ పాల్గొన్నారు.

గ్రూప్‌-1 ఉద్యోగం సాధించిన వారికి..



లక్ష్మీసాహితికి సన్మానం..

వైరా: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన గ్రూప్‌-1 పరీక్ష ఫలితాల్లో వైరాకు చెందిన సంగెపు లక్ష్మీ సాహితి డీఎస్పీ ఉద్యోగం సాధించింది. ఈ మేరకు మంగళవారం ఆమె వైరా ఏసీపీ ఏం.ఎ రహమాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సాహితికి శాలువాతో సత్కరించి అభినందించారు.



సురేష్‌బాబుకు స్వాగతం

కారేపల్లి: ఇటీవల విడుదల చేసిన గ్రూప్‌-1 ఫలితాల్లో మండలంలోని పైల్‌తండా గ్రామానికి చెందిన బాణోతు సురేష్‌బాబును గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాణోతు సక్రాం, ఉపాధ్యాయులు దేవ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి ఆలయాల్లో అన్నదానం



విరాళం అందజేస్తున్న వెంకటేశ్వరరెడ్డి

సత్తుపల్లి: పట్టణంలోని వేంసూరురోడ్డు శ్రీ మెట్టాంజనేయస్వామి, అయ్యగారిపేట శ్రీభక్తాంజనేయస్వామి ఆలయాలలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. సత్తుపల్లికి చెందిన తుంబూరు వెంకటేశ్వరరెడ్డి, సంధ్యారాణి దంపతులు మెట్టాంజనేయస్వామి ఆలయానికి రూ.15,116లు విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు సాధు శివ, మల్లూరు అంకమ్మరాజు, కాలిలేని కాంతారావు, చీపు సురేష్, వెంకటేశ్వరరావు, రమణ పాల్గొన్నారు.



శ్రీ అభయాంజనేయ ఆలయంలో..

మధిర: ఆత్కూరు క్రాస్ రోడ్డులోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద మంగళవారం నిరుపేదలకు అన్నదానం చేశారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మందడపు నరసింహారావు, నాగమణి దంపతుల కుమారుడు శివ సత్య సాయి జన్మదినం, తూములూరి పాండురంగారావు వర్ధంతి సందర్భంగా నిరుపేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కోటేరు శివారెడ్డి, సీత, హనుమంతరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


తక్షణమే రోడ్డు మరమ్మతులు చేపట్టాలి

కొణిజర్ల: ప్రమాదకరంగా మారిన పల్లిపాడు- ఏన్కూరు రోడ్డును తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రం కొణిజర్లలో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దెబ్బతిన్న తారు రహదారి మరమ్మతులు చేపట్టకపోతే ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. మండలంలోని అనేక గ్రామాల ప్రజలు బైకులు, ఆటోల ద్వారా ఈ రోడ్డు మీదనే ప్రయాణం చేయాల్సి వస్తుందన్నారు. రాత్రి పూట ఈ రోడ్డు పై వెళ్లాలంటే భయపడుతూ ప్రయాణించాల్సి వస్తుందన్నారు.

నిండా ముంచింది..

అధిక వర్షాలతో పత్తికి తీవ్రనష్టం

- మిర్చి స్థానంలో సాగు చేసినా తీత ఆరంభంలోనే దెబ్బ
- నల్లగా మారిన కాయ, బూజు పడుతున్న పత్తి



వర్షానికి ఎర్రబారిన పత్తి పైరు



గూడ రాలిపోవడంతో కాయలు లేని పత్తి పంట





నల్లగా మారిన కాయలను చూపిస్తున్న రైతు

తల్లాడ: గతేడాది మిర్చి సాగు చేసి తీవ్ర నష్టాలను చవి చూసిన రైతులు ఈ ఏడాది పత్తి వైపు మొగ్గు చూపారు. పంట మార్పిడి వల్ల పత్తి ఏపుగా పెరిగి కాయ దశకు చేరడంతో సంతోషించారు. ఇంతలోనే అధిక వర్షాలు పత్తి రైతులను నిండా ముంచేస్తున్నాయి. గత వారం రోజులుగా ప్రతి రోజు వర్షాలు పడటం వల్ల పత్తి పొలాల్లో నీరు నిలిచి పైరు దెబ్బతింటోంది.

తగ్గనున్న దిగుబడులు

పత్తి సాగు ఎకరానికి రూ.35 వేల నుంచి రూ.45 వేలు వరకు పెట్టుబడి అవుతుంది. కౌలు రైతులకు కౌలు మరో రూ.30 వేలు అదనంగా పడుతుంది. అయితే, పైరు చేతికొచ్చే సమయానికి ప్రతికూల పరిస్థితులు కారణంగా పాడైపోతుంటే అన్నదాతలు చేసేదేమి లేక కంటనీరు పెట్టుకుంటున్నారు. పత్తిలో గూడ రాలిపోతుండగా… పత్తి తయారయ్యే దశలోనే కాయ రంగు మారిపోతుంది. కాయ నల్లగా మారి బూజు వస్తుంది. వర్షానికి పైరులో తయారైన పత్తి తడవడంతో తొణ పత్తిగా మారుతుంది. దీంతో పత్తి తీయటానికి ఇంకా ఆలస్యమవుతుంది. వర్షం లేకపోతే పత్తి బాగా విచ్చుకొని కూలీలు త్వరగా తీసేందుకు అనుకూలంగా ఉంటుంది.

8 వేల ఎకరాల్లో సాగు

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో మండలంలో 8 వేల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. గతేడాది మిర్చి సాగు చేసిన రైతులు ధర లేక తీవ్రనష్టాలను చవి చూడడంతో రైతులు ఈ ఏడాది పత్తి వైపు మొగ్గు చూపారు. మండలంలో వరి తర్వాత అధికంగా పండించేది పత్తి. దీంతో గతేడాది కంటే 2 వేల ఎకరాల్లో పత్తి విస్తీర్ణం పెరిగింది. అయితే పంట మార్చినా రైతులకు నష్టాలే ఎదురవుతున్నాయని చెబుతున్నారు.

కౌలు రైతులకు తీవ్ర నష్టం..

ఈ ఏడాది కౌలు రైతులు తీవ్రంగా నష్టపోనున్నారు. కౌలు రూ.30 వేలు, పంట పెట్టుబడి రూ.40 వేలు మొత్తం రూ.70 వేలు పెట్టుబడి పెట్టగా ఎకరానికి పది క్వింటాళ్ల దిగుబడి రావాల్సిన పత్తి ఐదు క్వింటాళ్లకు పడి పోతుంది. దీంతో కనీసం పెట్టిన పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదు. ఎన్నో ఆశలతో కౌలుకు తీసుకొని సాగు చేసిన రైతులకు ఈ ఏడాది వర్షం రూపంలో కోలుకోలేని దెబ్బ తగిలింది.

దిగుబడి తగ్గుతుంది



15 ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి పైరు సాగు చేశాను. మొదట్లో పత్తి బాగానే ఉంది. ఈ నెలలో పత్తి కాయ పగలి తీసే ముందు వరుసగా కురుస్తున్న వర్షాలకు కాయ నల్లగా మారుతుంది. దిగుబడి కూడా తగ్గుతుంది. ఎకరానికి పది క్వింటాళ్లు రావాల్సిన దిగుబడి ఐదు క్వింటాళ్లకు పడిపోతుంది.

– వేమా అర్జున్‌రావు, కౌలు రైతు, బిల్లుపాడు

గూడ రాలిపోతోంది



అధిక వర్షం కారణంగా పత్తి పైరులో గూడ రాలిపోతోంది. పత్తి పైరు ఎర్రబారి పోతుంది. నాలుగెకరాల్లో పత్తి పైరు సాగు చేశాను. పైరు చేతికొచ్చే సమయాన వర్షం కారణంగా దెబ్బతింటుంది. కళ్ల ముందే పత్తి పాడైపోతుంది. వర్షానికి దెబ్బతిన్న పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– గరిదేపల్లి బుచ్చయ్య, రైతు, తల్లాడ

సీపీఎం అభ్యర్థులను గెలిపించాలి



మాట్లాడుతున్న భారతి

పెనుబల్లి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎం బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని పార్టీ వీఎంబంజరు కార్యాలయంలో పార్టీ సత్తుపల్లి డివిజన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ… కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక స్థానికంగా పాలన కుంటుబడి గ్రామాల అభివృద్ధి నిర్వీర్యమైందన్నారు. ప్రజా సమస్యల కోసం పోరాడేది కమ్యూనిస్టులేనని సీపీఎం పరిపాలనలో ఉన్న కేరళ గ్రామ పంచాయతీల అభివృద్ధికి దేశానికి మార్గదర్శంగా ఉన్నారన్నారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదినేని రమేష్, డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి, నాయకులు మాదాల వెంకటేశ్వరరావు, కొలికపోగు సర్వేశ్వరరావు, తన్నీరు కృష్ణార్జున్‌రావు, అయినాల రామలింగేశ్వరరావు, గాయం తిరుపతిరావు పాల్గొన్నారు.

దుర్గాదేవిగా అమ్మవారి దర్శనం



కనకదుర్గాదేవిగా..

మధిర: మధిర పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ మేరకు తొమ్మిదో రోజు మంగళవారం అమ్మవారిని శ్రీ కనకదుర్గాదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ అధ్యక్షులు కపిలవాయి జగన్మోహన్ రావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

చండీహోమం..



హోమం చేస్తున్న అర్చకులు

సత్తుపల్లిరూరల్: మండల పరిధిలోని బుగ్గపాడు గ్రామంలో శ్రీకనకదుర్గాదేవి ఆలయ 40వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం భవాని మాలధారణ భక్తులతో చండీహోమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆలయ పూజలు యార్లగడ్డ దయానంద్ ఆధ్వర్యంలో సహస్రనామ కుంకుమార్చన పూజ చేశారు.



మత్కేపల్లిలో..

చింతకాని: మండలంలో నిర్వహిస్తున్న దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో దుర్గాదేవికి పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఇష్టమైన చక్కెర పాయసం, పులిహోర నైవేద్యంగా సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

తల్లాడ: దేవీ నవరాత్రోత్సవాలలో భాగంగా స్థానిక రామలింగేశ్వర స్వామి ఆలయం, కోట మైసమ్మ దేవాలయ వద్ద దుర్గాదేవి అవతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కంచెల సతీష్ శర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.



పడమటి లోకవరంలో అన్నదానం..

కల్లూరు: మండల పరిధిలోని పడమటలోకవరం గ్రామంలో అమ్మవారి అన్నపూర్ణదేవి రూపంలో పూజలందుకున్నారు. అమ్మవారి మండపం వద్ద దేవాలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఎస్సై సంధ్య

ఏన్కూరు: దేవీనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్సై నారబోయిన సంధ్య అన్నారు. స్థానిక కొదండ రామాలయంలో నిర్వహిస్తున్న దేవీనవరాత్రి ఉత్సవాలలో భాగంగా కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కల్లూరురూరల్: శ్రీదుర్గాదేవిగా మారెమ్మ తల్లి..



సత్తుపల్లిటౌన్: పూజలు చేస్తున్న భక్తులు

విద్యతోపాటు ఆధ్యాత్మికంగా ఎదగాలి



విద్యార్థులతో చర్చి ఫాదర్ ఆంతోని

కల్లూరురూరల్: విద్యార్థులు విద్యతోపాటు ఆధ్యాత్మికంగా ఎదగాలని ఆర్‌సీఎం చర్చి ఫాదర్ ఆంథోని కోరారు. మండల పరిధిలోని పెద్దకోరుకొండి ఆర్‌సీఎం చర్చి ఫాదర్ వినయ్ ఆంథోని మంగళవారం విద్యార్థులతో ఆధ్యాత్మిక విషయాలతో పాటు విద్యాపరంగా విద్యార్థుల అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల నుంచి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ



వైరారూరల్: జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ జన్మదినం సందర్భంగా వైరాలోని శ్రీ బాలాజీ ఆస్పత్రిలో మంగళవారం 'నేనున్న మహిళ మండలి వెల్ఫేర్ సొసైటీ' ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. శ్రీ బాలాజీ వైద్యులు డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ కవిత, వెల్ఫేర్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

సందడి లేని స్థానిక ఎన్నికలు



ఎర్రుపాలెం మండల పరిషత్ కార్యాలయం

ఎర్రుపాలెం: ఐదేళ్లకొకసారి జరిగే స్థానిక ఎన్నికల పరంగా అన్ని గ్రామాల్లోని కార్యకర్తలు, నాయకులు, ప్రజల్లో సందడి ఉండటం ఆనవాయితీగా ఉంది. కానీ ఈసారి ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం ప్రకటించినప్పటికీ గ్రామాలన్నీ చడిచప్పుడు లేకుండా ఉన్నాయి. రిజర్వేషన్ల విషయమై ఈనెల 8న హైకోర్టు తీర్పు ఉండటంతో ఎన్నికల్లో పోటీ చేసే ఆశావహుల్లో ఉత్కంఠత నెలకొంది. ఇవే రిజర్వేషన్లు ఉంటాయా లేక మారతాయా అనే సందిగ్ధం నెలకొంది. అస్సలు ఎన్నికలే జరగవు అనే సోషల్ మీడియాలో వస్తున్న ప్రకటనలతో గందరగోళం నెలకొంది. ఈనెల 9 నుంచే తొలి విడత నామినేషన్ల ప్రక్రియ ఉన్నప్పటికీ ఆశావాహుల్లో ఉత్సాహం నామమాత్రంగానే ఉంది. మండలంలో 31 పంచాయతీలకు, 14 ఎంపీటీసీలకు, జెడ్పీటీసీకి రిజర్వేషన్లు ఖరారైనప్పటికీ ఓసీ సీట్లు ఆశించిన స్థాయిలో రాకపోవడంతో జనరల్ కేటగిరి ఆశావాహులు డీలా పడ్డారు. బీసీ కులాల జెడ్పీటీసీకి ఎస్సీ జనరల్, ఎంపీపీ స్థానం బీసీ మహిళకు కేటాయించారు. 31 పంచాయతీలకు గానూ బీసీలకు 12 పంచాయతీ స్థానాలను, ఎస్సీలకు 9, ఓసీలకు 9, ఎస్టీకి 1 స్థానం రిజర్వేషన్లుగా కేటాయింపు చేశారు. మొత్తం 14 ఎంపీటీసీల స్థానాలకు గానూ బీసీలకు 6, ఎస్సీలకు 4, ఓసీలకు 4 స్థానాలు కేటాయింపు చేశారు. మొత్తం మీద గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికల వేడి లేకపోవడంతో ప్రజల్లో కూడా ఆసక్తి లేకుండా ఉంది.

ఫ్లెక్సీల తొలగింపు..



విగ్రహాలకు ముసుగులు వేస్తున్న సిబ్బంది

ముదిగొండ: ఎన్నికల నిబంధనల ప్రకారం రాజకీయ నాయకుల ఫ్లెక్సీలను పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది మంగళవారం తొలగించారు. మండలంలోని వల్లభి, ముదిగొండ గ్రామాల్లో తొలగించిన ఫ్లెక్సీలను ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి పరిశీలించారు. కమలాపురం, గంధసిరి, బాణాపురం గ్రామాల్లో ఎంపీఓ వాల్మీకీ కిషోర్ పరిశీలించారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించొద్దని హెచ్చరించారు. ఎక్కడా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించొద్దని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ రంగం కార్పొరేటీకరణకు కుట్ర



మాట్లాడుతున్న హనుమంతురావు

సత్తుపల్లిటౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని పెట్టుబడిదారులైన ఆదాని, అంబానీలకు అప్పగించటం కోసం చేసే కార్పొరేటీకరణను వ్యతిరేకించాలని అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మిడి హనుమంతురావు పిలుపునిచ్చారు. స్థానిక నీలం రామచంద్రయ్య భవనంలో మంగళవారం జరిగిన డివిజన్ ప్రథమ మహాసభలో మాట్లాడారు. ఇప్పటికే వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేయటం కోసం కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక నల్లచట్టాలను తెస్తోందన్నారు. సోమనాథ్ కమిటీ సిఫార్సు అమలు చేయటంలో పూర్తిగా విఫలం చెందారన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టాన్ని అమలు చేస్తామని చెప్పి ఇప్పటికి అమలు కాలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాస్‌లైన్ డివిజన్ అధ్యక్షుడు ఎ.వెంకన్న, సంఘం డివిజన్ అధ్యక్షులు గంటా శ్రీనివాసరావు, బీరెల్లి లాజర్, ఒగ్గు నాగిరెడ్డి, ఎ.శరత్, తాటి రాజు, కృష్ణ, వెంకటేష్, కిషోర్, మారుతి పాల్గొన్నారు.

మహిళ తీరుపై ఫిర్యాదు

సత్తుపల్లిరూరల్: మండలంలోని సిద్ధారంలో మహిళలు సోమవారం సాయంత్రం బతుకమ్మ ఆడుతుండగా ఓ మహిళ అనుచితంగా వ్యవహరించిందని స్థానికులు ఆరోపించారు. గ్రామ ఎస్సీ కాలనీలో మహిళలు బతుకమ్మ ఆడుకుంటుండగా సింగపోగు కుమారి వ్యవహరించిన తీరును వారు తప్పుపట్టారు. ఈమేరకు ఆమెపై మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

'జనరల్ స్థానాల్లో ఎమ్మార్పీఎస్ పోటీ'



మాట్లాడుతున్న నరేష్

ఏన్కూరు: ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో ప్రతీ జనరల్ స్థానాల్లో ఎమ్మార్పీఎస్ పోటీ చేస్తుందని పార్టీ మండల అధ్యక్షుడు యంగళ నరేష్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఎమ్మార్పీఎస్ మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీ మండలంలో స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన రిజర్వేషన్లను ఎమ్మార్పీఎస్ వ్యతిరేకిస్తుందని, స్సీ, బీసీ సామాజిక వర్గాలను గుర్తించకపోవడం అవమానించేడమేనన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూర్ణకంటి మైసారావు, దామెర్ల వీరయ్య, నాగరాజు, నరేష్, రాకేష్ పాల్గొన్నారు.

వ్యక్తి నిర్మాణంతోనే దేశ నిర్మాణం..



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

బోనకల్: వ్యక్తి నిర్మాణం ద్వారా దేశ నిర్మాణమే ఆర్‌ఎస్ఎస్ లక్ష్యమని జిల్లా సామాజిక సమరసత సంయోజక్ కిషోర్‌రెడ్డి అన్నారు. ఆర్‌ఎస్ఎస్ ఏర్పడి వందేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం మండలకేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ… విభిన్న రంగాల్లో దేశభక్తి, హిందుత్వ ఆధార సంస్థలతో పని చేసి దేశ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఉప మండల ప్రముఖ్ గంగుల పిచ్చేశ్వరరావు, స్వయం సేవకులు రేగళ్ల కిషోర్, మెట్టేల నాగరాజు, పరుశురాం, ప్రదీప్, శివరాం , ఉదయ్, ప్రదీప్ చౌదరి పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

సత్తుపల్లిరూరల్: బతుకమ్మ ఉత్సవాల సందర్భంగా సత్తుపల్లి బైపాస్‌రోడ్‌లోని బతుకమ్మ వేడుకల్లో మంగళవారం నిర్వాహకులు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీకనకదుర్గాదవి అమ్మవారు, వివిధ అందమైన ముగ్గులను వేసి ఆకట్టుకున్నారు. పోటీలలోని విజేతలకు బహుమతులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు బెల్లంకొండ రాము, సునీత, మహిళలు పాల్గొన్నారు.

ముమ్మరంగా పంటల నమోదు

- ఏన్కూరు మండలంలో 70 శాతానికి పైగా పూర్తి
- ఉత్పత్తుల అమ్మకం సులువయ్యే అవకాశం



పంట ఫొటో అప్‌లోడ్ చేస్తున్న ఏఈఓ

ఏన్కూరు: ఈ వానాకాలం సీజన్‌లో మండలవ్యాప్తంగా సాగవుతున్న పంటల నమోదు కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. వ్యవసాయాధికారులు డిజిటల క్రాప్ సర్వే ద్వారా పంటల వివరాలు నమోదు చేస్తున్నారు. తద్వారా రైతులు పండించిన పంట ఉత్పత్తులను ప్రభుత్వ కేంద్రాల్లో అమ్ముకోవడం సులువవుతుందని, ఫలితంగా మద్దతు ధర లభిస్తుందని చెబుతున్నారు. మండలంలో ఈ ఏడాది 4,751 ఎకరాల్లో వరి, 16,437 పత్తి, 1,500 ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. వ్యవసాయాధికారులు అన్ని గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పంట వివరాలు నమోదు చేస్తున్నారు. ఇప్పటికే 70 శాతం పూర్తి కాగా, మరో వారంలోగా పూర్తిచేయాలని నిర్దేశించుకున్నారు.

మద్దతు ధర లభిస్తుందని..

ఇప్పటి వరకు పంట నమోదు చేయించుకోని రైతులు ముందుకు రావాలని కోరుతున్నారు. కాగా, సర్వేలో వివరాలు నమోదు చేయించుకుంటే ధాన్యం కొనుగోలు కేంద్రానికి వెళ్తే ఆన్‌లైన్‌లో సర్వే నంబర్‌ను పరిశీలిస్తే రైతు వివరాలన్నీ తెలిసిపోతాయి. అలాగే, పత్తి రైతుల వివరాలు సీసీఐ కేంద్రాల్లో నమోదు చేయడం సులువవుతుంది. తద్వారా ప్రభుత్వం ప్రకటించిన మద్దతుధర లభిస్తుందని చెబుతున్నారు.

గిట్టుబాటు ధర వచ్చింది



గతేడాది పత్తి సాగు చేయగా, పంట నమోదు చేయించుకున్నా. పంట చేతికొచ్చాక వ్యాపారులు తక్కువ ధర చెప్పారు. దీంతో సీసీఐ కొనుగోలు కేంద్రానికి వెళ్లాను. 28 క్వింటాళ్లు విక్రయిస్తే క్వింటాకు అదనంగా రూ1,200 వచ్చింది. అందుకే ఈ ఏడాది నమోదు చేయించా.

– ధరావత్ రవి, రైతు, సూర్యతండా

అందరూ ముందుకు రావాలి



మండలంలో 60 శాతం మేర పంట నమోదు పూర్తయింది. మరో వారంలోగా మొత్తం పూర్తిచేస్తాం. ఇప్పటివరకు రైతులంతా సహకరించారు. ఇంకా నమోదు చేయించుకుని రైతులు ముందుకొస్తే కొనుగోలు కేంద్రాల్లో గిట్టుబాటు ధర పొందడం సాధ్యమవుతుంది.

– ఆర్.బాలకృష్ణ, ఏఈఓ, తిమ్మారావుపేట